# వేగుచుక్క


పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ గురువారం 25 జూలై 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:01 సంచిక: 368

**బడ్జెట్‌లో అన్ని రాష్ట్రాల పేర్లు ప్రస్తావించడం అసాధ్యం**

3లో


PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

హైదరాబాద్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని, రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపిందని శాసనసభ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అన్ని రాష్ట్రాల సమీకృత, సమ్మిళిత అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ బాధ్యత అయినప్పటికీ, సమాఖ్య స్ఫూర్తిని విస్మరించిందంటూ నిరసించింది. కేంద్రం వెంటనే బడ్జెట్‌ను సవరించి.. తెలంగాణకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తీర్మానం చేసింది. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందనే అంశంపై బుధవారం మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విస్తృతంగా చర్చించారు. ప్రధానిని, కేంద్ర మంత్రులను సీఎం, రాష్ట్ర మంత్రులు పలుమార్లు కలిసి.. వివిధ ప్రాజెక్టులకు ఆర్థిక సాయం, చట్టప్రకారం రావాల్సిన నిధులతోపాటు అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యలను పరిష్కరించాలని కోరినప్పటికీ కేంద్రం పట్టించుకోకుండా వివక్ష చూపిందని సభ పేర్కొంది. కేంద్రం వైఖరిపై కాంగ్రెస్ సభ్యులు ధ్వజమెత్తగా... ప్రధాన ప్రతిపక్షమైన భారాస ఎమ్మెల్యేలూ ఎండగట్టారు. తీర్మానానికి మజ్లిస్, సీపీఐలు మద్దతు తెలిపాయి. భాజపా వాకౌట్ చేసింది. చర్చ సందర్భంగా వాడీవేడి వాదనలు జరిగాయి. అధికార, విపక్షాల సభ్యులు సవాళ్లు, ప్రతి సవాళ్లు చేసుకున్నారు. తెలంగాణ హక్కులకు భంగం కలిగించినందుకు, నిధుల కేటాయింపులో జరిగిన అన్యాయానికి నిరసనగా ఈ నెల 27న ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగే నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

**చర్చను ప్రారంభించిన సీఎం**

ఉదయం ప్రశ్నోత్తరాలు ముగిసిన వెంటనే 'కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం అంశం'పై చర్చను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రం వైఖరిని తప్పుబట్టారు. అనంతరం పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. కేంద్రం వివక్షాపూరిత విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. అనంతరం భారాస ఎమ్మెల్యే కేటీఆర్ మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలో కేంద్రం నుంచి ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు



తెలిపారు. భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌పై శాసనసభలో చర్చించడం మంచి సంప్రదాయం కాదన్నారు. ఆ తర్వాత మంత్రి పొన్నం ప్రభాకర్, మజ్లిస్ సభ్యుడు మాజిద్ హుస్సేన్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. అనంతరం సభలో సీఎం తీర్మానాన్ని ప్రవేశపెట్టి.. మాట్లాడారు. సీఎం ప్రసంగం ముగిశాక తీర్మానాన్ని సభ ఆమోదించింది.

**సవాళ్లు.. ప్రతి సవాళ్లు**

చర్చ సందర్భంగా తొలుత కేటీఆర్‌తో సీఎం, మంత్రుల వాగ్వాదం జరిగింది. తీర్మానం కాపీ తమకు అందలేదని కేటీఆర్ చెప్పగా... తీర్మానం ఇంకా పెట్టలేదని, చర్చ మాత్రమే ప్రారంభించామని రేవంత్ అన్నారు. కేటీఆర్ తన ప్రసంగంలో

**కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని, రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపిందని శాసనసభ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.**

**సవరించాలని డిమాండ్ చేస్తూ శాసనసభ తీర్మానం**

**భారాస, మజ్లిస్, సీపీఐల మద్దతు చర్చ సందర్భంగా రేవంత్, కేటీఆర్‌ల మధ్య వాగ్వాదం**

**భాజపా సభ్యుల వాకౌట్**

**నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరించనున్నట్లు ప్రకటించిన సీఎం**

భాజపా, కాంగ్రెస్‌లను విమర్శిస్తుండగా.. మంత్రి శ్రీధర్‌బాబు అభ్యంతరం తెలిపారు. ప్రస్తుత బడ్జెట్ గురించే మాట్లాడాలని ఉపముఖ్యమంత్రి భట్టి సూచించారు. చివర్లో దిల్లీలో దీక్షకు కేసీఆర్‌ను రమ్మనాలని రేవంత్ పేర్కొనగా.. విపక్ష నేత పేరును సీఎం ప్రస్తావించారని, దానికి తాను సమాధానం చెబుతానని, మాట్లాడేందుకు అనుమతి ఇవ్వాలని హరీశ్‌రావు కోరారు. ఇందుకు అంగీకరించకపోవడంతో భారాస సభ్యులు నిల్చొని నిరసన తెలిపారు. దీంతో భట్టి మాట్లాడిన తర్వాత అవకాశం ఇస్తానని సభాపతి చెప్పారు. ఆమేరకు అవకాశం ఇచ్చారు.

**తీర్మానంలో ఏముందంటే..**

భారతదేశం అన్ని రాష్ట్రాల సమాఖ్య అని, వాటి సమీకృత సమ్మిళిత అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని.. ఈ స్ఫూర్తిని విస్మరించిందని తీర్మానం

మిగతా 2లో

# సింగరేణిని

## ప్రైవేటీకరించం: కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ: సింగరేణిని ప్రవేటీకరించే ప్రసక్తే లేదని కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో స్పష్టం చేసింది. ప్రశ్నోత్తరాల సందర్భంగా సింగరేణి ప్రైవేటీకరణపై పెద్దపల్లి ఎంపీ వంశీ ప్రశ్నించారు. ఈ సందర్భంగా మంత్రి కిషన్ రెడ్డి ఈ మేరకు సమాధానం ఇచ్చారు. దేశంలో ఏ బొగ్గుగనినీ ప్రైవేటుపరం చేసే ఆలోచన తమ ప్రభుత్వానికి లేదని చెప్పారు.ప్రైవేటీకరణ చేయాలంటే 51 శాతం వాటా ఉన్న రాష్ట్ర నిర్ణయమే కీలకని చెప్పారు. సింగరేణి ప్రైవేటీకరణ అంశం రాష్ట్ర ప్రభుత్వ చేతుల్లోనే ఉందని వెల్లడించారు. ఒడిశాతో చర్చించి సింగరేణికి ఒక గనిని కేటాయించామని తెలిపారు. సింగరేణికి కేంద్రం నుంచి పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.



# కొరడా ఝుళిపిస్తున్న 'మా'

హైదరాబాద్:'మా' సినిమా కళాకారులపై ఆసభకరమైన, అవమానకరమైన కంటెంట్‌ను పోస్ట్ చేసినందుకు గాను 25 యూట్యూబ్ ఛానెళ్లను రద్దు చేసిన విషయం తెలిసిందే. ఆ అణిచివేతలో భాగంగా 'మా' మరో అడుగు ముందుకు వేసింది. తాజాగా అసత్య వార్తలను పోస్ట్ చేస్తున్న 18 యూట్యూబ్ ఛానళ్లను రద్దు చేయించినట్లు మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) తెలిపింది. ఈ మేరకు మా రద్దు చేసిన ఆ యూట్యూబ్ ఛానళ్ల వివరాలను సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. ఆ క్రమంలో..' మా అసోషియాన్ తరపున, మేము అన్ని యూట్యూబర్‌లు మరియు సోషల్ మీడియా ట్రోలర్‌లను గమనించవలసిందిగా కోరుతున్నాము అంటూ స్పెషల్ రిక్వెస్ట్ హెచ్చరిక జారీ చేసింది. 'మా' సినిమా వాళ్ళ కుటుంబాలకు పరువు నష్టం కలిగించే ట్రోల్ వీడియోలను సైబర్ క్రైమ్ కార్యాలయానికి నివేదించడానికి మేము సిద్ధంగా ఉన్నాము.

# ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం ఎప్పుడు?



హైదరాబాద్: ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం ఎప్పుడు పూర్తి చేస్తారు ?

అపాయింట్‌మెంట్ డేట్‌ని ఎప్పుడు ప్రకటిస్తారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాల్లో క్వశ్చన్ అవర్‌లో ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీపై అడిగిన ప్రశ్నలకు మంత్రి ఇచ్చిన సమాధానాలు ఒకరకంగా చెప్పాలంటే బాధ్యతా రహితంగా, తప్పుదోవ పట్టించేలా ఉన్నాయన్నారు. జాప్యం జరగడానికి గల కారణాలు ఏంటీ? అన్నప్పుడు లేదండీ అన్నారని తెలిపారు. ఇంకా ఆయన మాట్లాడుతూ 'ప్రభుత్వం వచ్చి ఎనిమిదో నెల జరుగుతున్నది. ఇంకా జాప్యం జరుగలేదని చెప్పారు. ఎప్పటిలోగా ఈ ప్రతిపాదనలు అమలు చేసి.. నియమితరోజు ప్రకటించడం అవుతుందా? అంటే పరిశీలనలో ఉందని మంత్రి చెప్పారు. కాంగ్రెస్ మేనిఫెస్టో పేజీ నెంబర్ 28లో ఐటెమ్ నంబర్ 14లో టీఎస్ ఆర్టీసీ సిబ్బంది సంక్షేమం అని పెట్టారు. ఇందులో ఆర్టీసీ కార్మికులను, ప్రభుత్వ విలీన పక్రియ పూర్తి చేసి రెండు పీఆర్సీల బకాయిలను వెంటనే చెల్లిస్తాం అని చెప్పారు. ఎనిమిది నెలల సమయం సరిపోదా?' అంటూ ప్రశ్నించారు. వచ్చే పీఆర్సీ పరిధిలోకి ఆర్టీసీ కార్మికులను చేరుస్తాం. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని వసతులు, సదుపాయాలు కల్పిస్తాం. ఆర్టీసీ బస్సులను ఆధునికకీరించి.. విస్తరిస్తాం. అధునాతమైన సౌకర్యాలతో కొత్త సర్వీసులను ప్రారంభిస్తాం. ఆర్టీసీ యూనియన్ పునరుద్ధరణకు అనుమతిస్తాం' అని మేనిఫెస్టోలో చెప్పారు. విషయాల్లోకి వెళ్లకుండా మంత్రిని సూటిగా ప్రశ్నించ దలచుకున్నాను. మంత్రి ఎప్పటిలోగా అపాయింటెడ్ డే ప్రకటిస్తారు ? ఏ రోజు నుంచి ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తారు ? పరిశీలనలో ఉంది.. చూస్తాం.

మిగతా 2లో

# ఢిల్లీలో దీక్షకు నేను సిద్ధమే







**కెసిఆర్ సిద్ధమా అని ప్రశ్నించిన సిఎం రేవంత్**

**కెటిఆర్, హరీష్ రావుల ప్రశ్నకు సమాధానం**

**హైదరాబాద్:** రాష్ట్రానికి నిధుల కోసం దిల్లీలో దీక్ష చేయాలని భారాస ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్ రావు చేసిన డిమాండ్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. అయితే, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ వస్తే.. ప్రభుత్వాధినేతగా తాను వస్తానని రేవంత్ చెప్పారు. రాష్ట్రానికి నిధుల కోసమైనా కేసీఆర్ ముందుకు రావాలన్నారు. మీరే తారీఖు డిసైడ్ చేయండి దీక్షకు మేం సిద్ధం. తెలంగాణకు నిధులు తెచ్చుడో..సచ్చుడో తేల్చుకుందామని సవాల్ విసిరారు. చావు నోట్లో తల పెట్టి తెలంగాణ తెచ్చామని మేమెప్పుడూ పదే పదే చెప్పలేదు. రూ.100 పెట్టి పెట్రోల్ కొన్నారు కానీ, అగ్గిపెట్టి కొనలేదు. అగ్గిపెట్టి మర్చిపోయినట్టు నటించి అమాయక విద్యార్థులను బలిగొనలేదు అని రేవంత్‌రెడ్డి విమర్శించారు. కేంద్ర బ్జడెట్‌లో రాష్ట్రానికి అన్యాయంపై శాసనసభలో చర్చ సందర్భంగా అధికార, ప్రతిపక్ష నేతల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. పరస్పర విమర్శలతో సభ వేడెక్కింది. 'కేంద్ర బ్జడెట్‌లో తెలంగాణకు అన్యాయం' అనే అంశంపై రాష్ట్ర శాసనసభలో ఇవాళ చర్చ సందర్భంగా అన్ని పార్టీలు తమ అభిప్రాయాలను

వెల్లడించాయి. బీఆర్ఎస్ తరపున కేటీఆర్ ఇప్పటికే మాట్లాడారు. అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం సరైన విధానాన్ని పాటించలేదని విమర్శించారు. అనంతరం తీర్మానంపై తన అభిప్రాయాన్ని వినిపించారు. ఆ తర్వాత మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. తెలంగాణకు అన్యాయంపై రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన తీర్మానాన్ని తాము ఏకగ్రీవంగా ఆమోదిస్తామని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందనే విషయం వాస్తవమని హరీశ్‌రావు అన్నారు. ఈ అన్యాయంపై రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్తామంటే వచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. అంతేకాదు, బ్జడెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపినందుకు నిరసనగా సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో దీక్ష చేస్తానంటే తాము మద్దతిస్తామని చెప్పారు.

# నేడు అసెంబ్లీలో బడ్జెట్ సమర్పణ

**బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి విక్రమార్క**



హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీలో ఆర్థికమంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం

బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. బుధవారం బడ్జెట్ అన్యాయాలపై చర్చించిన అనంతరం శాసనసభ నేటికి వాయిదా పడింది. మధ్యాహ్నం సభ తిరిగి ప్రారంభం కానుంది. మధ్యాహ్నం 12 గంటలకు డిప్యూటీ సీఎం, రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. తర్వాత బడ్జెట్‌పై చర్చ జరగనుంది. మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి బడ్జెట్‌పై చర్చకు సమాధానం ఇచ్చే అవకాశం ఉంది.కాగా, శాసనసభలో బుధవారం తెంగాణకు అన్యాయం' అనే తీర్మానంపై

చర్చ జరిగింది. అన్ని పార్టీల నేతలు ఈ తీర్మానంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. బీఆర్ఎస్ తరపున పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీలో మాట్లాడారు. తీర్మానానికి వ్యతిరేకంగా బీజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు.




# అసెంబ్లీని వదిలి ధర్నాలు చేయడమా

అమరావతి: ఢిల్లీలో జగన్ చేపట్టిన ధర్నాపై టీడీపీ నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీకి ఎగ్గొట్టాలనే ధర్నాలు చేస్తున్నారన్నారు. ఢిల్లీ వెళ్ళి తుగ్లక్ రెడ్డి ధర్నా చేయడం సిగ్గుచేటన్నారు. జగన్‌కు రెడ్ బుక్ అంటే భయపడుతున్నారని... ఢిల్లీ వెళ్ళి అక్కడ కూడా రెడ్ బుక్ అని మాట్లాడుతున్నారని, ప్రతిపక్ష హోదా లేకపోయినా ప్రతిపక్ష సభ్యుడుగా హుందాగా వ్యవహరించాలని హోంమంత్రి వంగలపూడి అని అన్నారు. జగన్ ఢిల్లీలో ఫొటో ఎగ్జిబిషన్ పెట్టారని.. అందులో వైసీపీ హయాంలో జరిగినవి ఉన్నాయేమో చూసుకోవాలన్నారు. వైసీపీ హయాంలో జరిగిన ఘటనలు ఢిల్లీలో ఫొటో ఎగ్జిబిషన్ పెట్టాలి కదా జగన్ అంటూ వ్యాఖ్యలు చేశారు. గత ఐదేళ్లలో తమరు చేసిన ఘటనలు ఎగ్జిబిషన్ పెడితే ఢిల్లీ సగం సరిపోదంటూ హోంమంత్రి అనిత విమర్శలు గుప్పించారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వైసీపీ శ్రేణులపై జరుగుతున్న దాడులకు నిరసనగా వైసీపీ అధినేత జగన్ ఢిల్లీలో ధర్నా చేపట్టిన సంగతి తెలిసిందే. వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో కలిసి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నాతో పాటు దాడులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలతో ఫొటో గ్యాలరీ కూడా ప్రదర్శించారు.


# కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

పేర్కొంది. "కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు వివక్ష జరిగింది. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇదే ధోరణి కొనసాగించింది. విభజన చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల సుస్థిర అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలను కేంద్రం చేపట్టాలి. కానీ, చట్టంలో పొందుపరిచిన హామీల అమలులో విఫలమైంది. దీని వల్ల తెలంగాణ ప్రగతిపై తీవ్ర ప్రభావం పడింది. తెలంగాణపై కేంద్రం అనుసరించిన తీరుపై ఈ సభ తీవ్ర అసంతృప్తిని, నిరసన తెలియజేస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంటు సమావేశాల్లోనే కేంద్ర బడ్జెట్‌కు సవరణలు చేసి తెలంగాణకు న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలి" అని శాసనసభ తీర్మానం చేసింది.

**నలుగురు మాజీ ఎమ్మెల్యేల మృతికి సంతాపం**

ఈనాడు, హైదరాబాద్: నలుగురు మాజీ ఎమ్మెల్యేల మృతికి శాసనసభ బుధవారం సంతాపం తెలిపింది. ధర్మపురి శ్రీనివాస్(నిజామాబాద్ అర్బన్), నెమరుగొమ్ముల సుధాకర్‌రావు(వరంగల్ జిల్లా చెన్నూరు), రమేశ్ రాథోడ్(నిర్మల్ జిల్లా ఖానాపూర్), మహమ్మద్ విరాసత్ రసూల్‌ఖాన్(నాంపల్లి)ల మృతికి సంతాపంగా శాసనసభలో సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. వారి కుటుంబ సభ్యులకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

దేశం ఐదు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ సాధించాలంటే హైదరాబాద్ అభివృద్ధికి నిధులివ్వాలని ప్రధానికి స్పష్టంగా చెప్పాం. మూసీ అభివృద్ధికి, మెట్రో విస్తరణకు, ఫార్మా అభివృద్ధికి నిధులు కోరాం. ఐఐఎం, సైనిక్ స్కూల్ ఇవ్వాలని కోరాం. అయినా పట్టించుకోలేదు. సభలో పార్టీలు, వ్యక్తుల ప్రయోజనాల కోసం కొంతమంది మాట్లాడటం శోచనీయం. అందరం ఏకతాటిపై ఉంటే.. కేంద్రం మెడలు వంచి నిధులు సాధించుకోవటం పెద్ద కష్టం కాదు.



# ఆగస్ట్ 2వరకు అసెంబ్లీ సమావేశాలు

**హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఆగస్టు 2 వరకు కొనసాగనున్నాయి. ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ముందుగా 31 వరకే జరపాలనుకున్నా, అనేక అంశాలు చర్చించాల్సి ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. గురువారం అసెంబ్లీలో డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈనెల 26న అసెంబ్లీకి సెలవు, 27న బడ్జెట్ పద్దుపై చర్చ జరగనుంది. 28న ఆదివారం సెలవు ఉంటుంది. 29, 30 తేదీల్లో వివిధ బిల్లులు ప్రవేశపెట్టనున్నారు. 31న ద్రవ్యవినిమయ బిల్లు సభ ముందుకు తీసుకురానున్నారు. ఆగస్టు 1, 2 తేదీల్లో వివిధ బిల్లులు ప్రవేశపెట్టనున్నారు.

# శాసనసభలో రేవంత్‌రెడ్డి, కేటీఆర్ మధ్య మాటల యుద్ధం

హైదరాబాద్: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై తెలంగాణ శాసనసభలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, భారాస ఎమ్మెల్యే కేటీఆర్ మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. అవగాహనా రాహిత్యంతో కేటీఆర్ సభను తప్పుదోవ పట్టిస్తున్నారని రేవంత్ అన్నారు. కీలకమైన చర్చ జరుగుతున్నప్పుడు కేసీఆర్ ఎందుకు రాలేదని సీఎం ప్రశ్నించారు 'మాకు జవాబు చెప్పండి చాలు. మీకు కేసీఆర్ అవసరం లేదు' అని కేటీఆర్ వ్యాఖ్యానించడంతో సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు.రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ "తండ్రి పేరు చెప్పుకొని నేను మంత్రిని కాలేదు. కింది స్థాయి నుంచి ఎదిగి ముఖ్యమంత్రిని అయ్యా. కేటీఆర్‌ది మేనేజ్‌మెంట్ కోటా అనుకున్నా. అంతకంటే దారుణం" అని అన్నారు. ఆ వెంటనే కేటీఆర్ స్పందిస్తూ 'రేవంత్ పేమెంట్ కోటాలో సీఎం అయ్యారని మేమూ అనొచ్చు' అని వ్యాఖ్యానించారు. దానికి రేవంత్ మళ్లీ కౌంటర్ ఇస్తూ 'పేమెంట్ కోటాలో సీఎంను కాలేదు. మొన్న భారాస నేతలు దిల్లీ వెళ్లి చీకట్లో మాట్లాడుకొని వచ్చారు' అని వ్యాఖ్యానించారు. కేటీఆర్ స్పందిస్తూ "మేనేజ్‌మెంట్ కోటాలో మంత్రి అయ్యానని సీఎం అనొచ్చా? సభా నాయకుడు అలా మాట్లాడొచ్చా?" అని ప్రశ్నించారు.

పదేళ్ల భారాస పాలనలో రాష్ట్రం దివాలా: రేవంత్‌రెడ్డి

ఆ తర్వాత మళ్లీ సీఎం రేవంత్ మాట్లాడుతూ కేసీఆర్‌పై విమర్శలు చేశారు. "మాకేమీ అక్కర్లేదు.. మీ ప్రేమ చాలని చెప్పిన మనిషి కేసీఆర్. విద్యుత్‌పై రాష్ట్రంలో ఇప్పటివరకు ఒక విధానమే



లేదు. రూ.7లక్షల కోట్ల అప్పు చేసి వెళ్లిపోయారు. భారాస పదేళ్ల పాలనలో రాష్ట్రం దివాలా తీసింది. గత ప్రభుత్వ పరిపాలనలో విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. మీరేం చేశారో చూశాకే ప్రజలు తీర్పు ఇచ్చారు. భారాసకు అసెంబ్లీలో వచ్చిన మెజారిటీ లోక్‌సభ ఎన్నికల్లో రాలేదు. లోక్‌సభలో గుండుసున్నా దక్కినా తీరు మారకుంటే ఎలా?ఇప్పటికైనా రాష్ట్ర ప్రజల హక్కుల కోసం మాట్లాడాలని కోరుతున్నా" అని సీఎం అన్నారు.

యాచిస్తే ఏమీ రాదు.. శాసించి సాధించుకోవాలి: కేటీఆర్

అనంతరం కేటీఆర్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చర్చను సమర్థిస్తున్నట్లు తెలిపారు. "విభజన సమయంలో తెలంగాణ హక్కుల కోసం ఎంతో పోరాడాం. మోదీ సర్కారుపై తెలంగాణ కోసం అనేక పోరాటాలు చేశాం. రాష్ట్ర హక్కులు ఎవరు హరించినా వారి మెడలు వంచుతాం. యాచిస్తే ఏమీ రాదు.. శాసించి సాధించుకోవాలి. దిల్లీ తత్వం ఇంతకాలానికి కాంగ్రెస్‌కు బోధపడింది. భాజపాకు వ్యతిరేకంగా మాట్లాడుతుంటే మీకేం ఇబ్బంది? కేంద్ర వివక్షను ఎండగట్టడంలో మేం సహకరిస్తాం. గతంలో కేంద్రం సాయం చేయకపోయినా ఎంతో అభివృద్ధి చేశాం. రేవంత్ రెడ్డి కష్టపడే ఈ స్థాయికి చేరుకున్నారు. చిన్నవయసులోనే సీఎం అయ్యారు.

కేంద్రం తెచ్చిన అన్ని బిల్లులకూ మేం మద్దతివ్వలేదు. దళితుడు రాష్ట్రపతి, తెలుగు బిడ్డ ఉపరాష్ట్ర అభ్యర్థులగా అయ్యే సమయంలో మద్దతిచ్చాం. కేసీఆర్‌ను కాదు.. ధైర్యముంటే మోదీని తిట్టండి. ఎన్నికలకు ఆరు నెలల ముందు రాజకీయాలు చేద్దాం. ఎన్నికల తర్వాత నాలుగున్నరేళ్లు ప్రజల గురించి ఆలోచిద్దాం. ఏం చేసినా బహిరంగంగానే చేశాం.. చీకటి ఒప్పందాలు మాకు అలవాటు లేదు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఏమీ ఇవ్వకుంటే మేమేం చేస్తాం?" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

మాకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం: భట్టి

తమకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. "హైదరాబాద్ పవర్ సర్కిల్‌ను ప్రైవేటు వాళ్లకు ఇస్తున్నట్లు ఎక్కడా చెప్పలేదు. ఎవరో పత్రికల్లో రాసినదాన్ని పట్టుకుని సభలో మాట్లాడితే ఎలా? కేటీఆర్ సభతోపాటు రాష్ట్రాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. భారాస వాళ్లలా ఏది పడితే అది చేసేవాళ్లం కాదు. సింగరేణి అంశంపై చర్చించేందుకు మేం సిద్ధం" అని భట్టి స్పష్టం చేశారు.

# ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం ఎప్పుడు?

అనుమతిస్తాం' అని మేనిఫెస్టోలో చెప్పారు. విషయాల్లోకి వెళ్లకుండా మంత్రిని సూటిగా ప్రశ్నించ దలచుకున్నాను. మంత్రి ఎప్పటిలోగా అపాయింటెడ్ డే ప్రకటిస్తారు ? ఏ రోజు నుంచి ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తారు ? పరిశీలనలో ఉంది.. చూస్తాం.. చేస్తామని కాలయాపన చేయడం కాదు. ఖచ్చితమైన తేదీని ఈ సభ ద్వారా ఆర్టీసీ కార్మికులకు చెప్పాలని మంత్రిని కోరుతున్న. యూనియన్ పునరుద్ధరిస్తామని మీరు హామీ ఇచ్చారు. యూనియన్ పునరుద్ధరణ ఎప్పటిలోగా చేస్తారు ? మాకున్న సమాచారం ఏందంటే ప్రభుత్వం నుంచి యూనియన్‌ను పునరుద్ధరించేది లేదని ఉత్తర్వులు ఇచ్చినట్లుగా మా దృష్టికి వచ్చింది. ఉత్తర్వులు ఇచ్చారా? లేదా? ఇవ్వకపోతే ఎప్పటిలోగా యూనియన్‌ను పునరుద్ధరిస్తారు' అంటూ నిలదీశారు. ఆర్టీసీలో చనిపోయిన కార్మికులకు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న సమయంలో పిల్లలకు పర్మినెంట్ ఉద్యోగం ఇచ్చేవాళ్లం. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆ పర్మినెంట్ ఉద్యోగం అనే నిబంధన తీసివేసి.. మరో స్కీమ్‌ను పెట్టి కేవలం రూ.15వేల జీతం ఇచ్చి మూడేళ్లు పని చేస్తే అప్పుడు పర్మినెంట్ చేస్తామని చనిపోయిన కార్మికులకు మీ ప్రభుత్వం అన్యాయం చేసినమాట వాస్తవమా? ఇది ఎందుకు తెచ్చారు ? గత ప్రభుత్వంలాగా చనిపోయిన కార్మికుల పిల్లలకు వెంటనే రెగ్యులర్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. ముఖ్యమంత్రి, మంత్రి నె÷–లకెస్ రోడ్‌లో మా ప్రభుత్వం ఆర్డర్ ఇచ్చిన బస్సులు వస్తే జెండా ఊపారు సంతోషం. ప్రభుత్వం నిరంతర ప్రక్రియ. అయితే, జెండా ఊపిన సందర్భంగా కార్మికులకు రూ.300కోట్ల చెక్కును సీఎం చూపించారు. ఇగో కార్మికులకు పీఆర్సీ బకాయిలు విడుదల చేస్తామని చెక్కు చూపారు. పాపం మంత్రి సీఎం వెళ్లిపోయాక డమ్మీ చెక్కులు కార్మికులు ఇచ్చి ఫొటోలు దిగారు. ఈ చెక్కులు ఫిబ్రవరి 10, 2024 రోజున ఇచ్చారు. మనం ఇవాళ జూలై నెలలో ఉన్నాం. దాదాపు ఐదునెలలైనా నెక్లేస్‌రోడ్ నుంచి ఆ చెక్కు బస్ భవన్‌కు చేరలేదు. ఆ చెక్కు ఎప్పుడు చేరుతుంది ? ఎప్పుడు ఇస్తరు చెప్పాలని కోరుతున్నా'నన్నారు. ఆర్టీసీలో ఉద్యోగులపై పనిభారం మోపుతున్నారని.. కొత్త ఉద్యోగులను ఎప్పుడు నియమిస్తారని మంత్రి హరీశ్‌రావు శాసనసభలో ప్రశించారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడుతూ.. 'మహాలక్ష్మి పథకం తెచ్చారు సంతోషం. అభినందిస్తున్నాం. ఈ పథకానికి నెలనెల బిల్లులు విడుదల చేయని మాట వాస్తవమా మహాలక్ష్మి పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి ఇవ్వాల్సిన నిధులు ఎన్ని ఇప్పటి వరకు ఇచ్చినవి ఎన్ని.. ఇవ్వకపోవడం వల్ల కార్మికుల పీఎఫ్, సీసీఎస్ డబ్బులు మళ్లించి

కార్మికులకు జీతాలు ఇచ్చిన మాట వాస్తవమా? ఆ నిధులు ఎప్పటిలోగా ఇస్తారో చెప్పాలి' అని డిమాండ్ చేశారు. గతంలో మా ప్రభుత్వం ఉన్న సమయంలో ప్రభుత్వ ఉద్యోగులకు 43శాతం ఫిట్‌మెంట్ ఇస్తే ఆర్టీసీ కార్మికులకు 44శాతం ఇచ్చాం. గత తెలుగుదేశం ప్రభుత్వంలో కార్మికులకు బడ్జెట్‌లో రూ.100కోట్లు పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.200కోట్లు పెట్టింది. కానీ, ప్రభుత్వం రూ.1000కోట్లు, రూ.1500కోట్లు, రూ.1500కోట్లు బడ్జెట్‌లో పెట్టి ఆర్టీసీ సంస్థను కాపాడాం' అన్నారు. మధ్యలో హరీశ్‌రావు మాట్లాడుతుండగా మంత్రి శ్రీధర్‌బాబు ప్రసంగానికి అడ్డు తగిలారు. క్వశ్చన్ అవర్‌లో ప్రసంగాలు ఇస్తున్నారన్నారు అన్నారు. దీనికి హరీశ్‌రావు స్పందిస్తూ సూటిగా మంత్రికి ప్రశ్నలు వేశానన్నారు. ఆర్టీసీకి సంబంధం విషయాలు,రాజకీయాల జోలికి వెళ్లలేదని స్పష్టం చేశారు. ఆ తర్వాత మాట్లాడుతూ.. 'ఆర్టీసీలో దివ్యాంగులు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులకు రాయితీతో బస్‌పాస్‌లు ఇస్తాం. ఈ ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలల్లో రాయితీలకు సంబంధించి ఒక్క రూపాయి ఇవ్వమని మాట వస్తవమా? ఆ డబ్బు ఎంతా? ఎప్పటి వరకు ఇస్తారు ? ఇవ్వకపోవడానికి గల కారణాలు ఏంటీ? అని ప్రశ్నించారు. కార్మికులకు మోటార్ ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్ ఉంటుంది. డ్రైవర్లు, కండక్టర్లు ఎనిమిది గంటలకంటే ఎక్కువ పని చేయకూడదని ఉంటుంది. అందులో మహిళా కండక్టర్లు కూడా ఉన్నారు. వారిని 16గంటలు, 18 గంటలు పని చేయించడం వల్ల పని ఒత్తిడికి లోనై వందల సంఖ్యలో కార్మికులు చనిపోతున్న మాట వాస్తవమా? మహాలక్ష్మి పథకం వచ్చాక ఓవర్‌లోడ్ కావడం ద్వారా పనిగంటల భారం పెరిగి.. దానికి సరిపడా కండక్టర్లు, డ్రైవర్లను నియామకం చేయకపోవడం వల్ల కార్మికులు ఓవర్‌టైం చేసి ఇబ్బందులుపడున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా? దానికి అనుగుణంగా నియామకం ఎప్పటిలోగా చేస్తారు? ప్రభుత్వాన్ని రాజకీయాల్లోకి వెళ్లకుండా వెంటనే ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రక్రియ ఏర్పాటు చేయాలని.. స్పెసిఫిక్ డేట్ ఇచ్చి.. రాష్ట్రంలో ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న ఆర్టీసీ ఉద్యోగులకు ఈ సభ ద్వారా తీపికబురు అందించాలని స్పీకర్ ద్వారా సీఎం, రవాణాశాఖ మంత్రిని కోరుతున్నా'నన్నారు.

# విమానంలో మహిళకు ఊహించని అనుభవం

ఇటీవలి కాలంలో విమానాల్లో తరచూ రకరకాల సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ప్రయాణికులు, ఎయిర్‌లైన్ సిబ్బంది, ఎయిర్ లైన్ సంస్థలు చేస్తున్న కొన్ని పనులు తీవ్ర విమర్శలకు తావిస్తున్నాయి. ఇలాంటి ఘటనలు రోజురోజుకూ ఎక్కువ అవుతుండటంతో అసలు విమానాల్లో ప్రయాణించాలంటేనే జనం బెంబేలెత్తిపోతున్నారు. తాజాగా ఓ మహిళ తనకు.. విమానంలో ఎదురైన భయంకరమైన సంఘటనను మీడియాకు వెల్లడించింది. విమానంలో తనకు జరిగిన ఓ అనూ హ్యమైన సంఘటనను తాజాగా ఓ మహిళ.. మీడియా ముందు వెల్లడిం చింది. జనవరిలో జరిగిన భయానక అనుభవాన్ని తాజాగా పంచుకుంది. బ్రా వేసుకోలేదని.. ఎయిర్‌లైన్స్ సిబ్బంది తనను బెదిరించినట్లు ఆ మహిళ వెల్లడించడం తీవ్ర దుమారా నికి కారణం అయింది. ఈ సంఘటన అమెరికాలో చోటు చేసుకుంది. లిసా ఆర్చ్ బోల్డ్ అనే 38 ఏళ్ల మహిళ డెల్టా ఎయిర్‌లైన్స్ సిబ్బందిపై తీవ్ర ఆరోపణలు చేశారు. తాను బ్రా ధరించని కారణంగా తనను విమానం నుంచి దింపేస్తామన్నా రని హెచ్చరించారని పేర్కొంది. ఇది ముమ్మాటికీ వివక్షేనని మండిపడింది. తాను బ్యాగీ జీన్స్, లూజ్ టీ షర్ట్ వేసుకుని లోపల బ్రా వేసుకుండా విమానం ఎక్కినట్లు లిసా ఆర్చ్ బోల్డ్ తెలిపింది. అది గమనిం చిన డెల్టా ఎయిర్‌లైన్స్ మహిళా సిబ్బంది తనను అడ్డుకున్నట్లు తెలిపింది. అయితే తన ఎద భాగం బయటికి కనిపించక పోయిప్పటికీ వారు అభ్యంత రం వ్యక్తం చేసినట్లు పేర్కొంది. డీజే అయిన ఆర్చ్‌బోల్డ్.. అమెరికాలోని సాల్ట్ లేక్ సిటీ నుంచి శాన్‌ఫ్రాన్సిస్కోకు డెల్టా ఎయిర్‌లైన్స్ విమానంలో ప్రయాణి స్తుండగా.. ఈ ఘటన జరిగింది. ఈ అనూహ్య సంఘటన జనవరిలో జరిగిందని.. తాజాగా లాస్ ఏంజెల్స్‌లో నిర్వహించిన మీడియా సమావేశం లో తెలిపింది. విమాన సిబ్బంది తనతో అలా చెప్పడం వల్ల తీవ్ర అవమానంగా అనిపించిందని ఆవేదన వ్యక్తం చేసింది. తాను మహిళను కానని భావిం చి వారు తన పట్ల అలాంటి వ్యాఖ్యలు చేసినట్లు అనిపించిందని పేర్కొంది. తాను బ్రా ధరించక పోవడం వల్ల తన ఎద భాగం బహిర్గతం అయిందని.. అది ఆక్షేపణీయంగా ఉందని.. అందుకే తనను విమానంలోకి అనుమతించబో మని డెల్టా ఎయిర్‌లైన్స్ సిబ్బంది తనకు చెప్పినట్లు గుర్తు చేసుకుంది. టీ షర్ట్‌పై జాకెట్ వేసుకుంటేనే విమానంలో ప్రయాణించ డానికి అనుమతిస్తామని చెప్పినట్లు పేర్కొంది. ఈ ఘటనపై చర్చించేందుకు డెల్టా ఎయిర్‌లైన్స్ కంపెనీ ప్రెసిడెంట్‌తో సమావేశం కావాలని నిర్ణయించుకుని.. బాధిత మహిళ తరపున డెల్టా ఎయిర్‌లైన్స్‌కు ఓ లాయర్ లేఖ రాశారు. టీ షర్టులపై పురుషులు ఎలా జాకెట్లు వేసుకుంటారో అలా మహిళలు వేసుకోవాల్సిన అవసరం లేదని ఆ లాయర్ వాదించారు. ఒకవేళ భద్రతాపం ́మైన ముప్పు ఉంటేనే ప్రయాణికులను విమానం దింపాలి కానీ.. ఇలాంటి వాటికి దింపేస్తారా అని ప్రశ్నించారు. ఈ మీడియా సమావేశం తర్వాత డెల్టా ఎయిర్‌లైన్స్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో ఎట్టకేలకు ఆర్చ్ బోల్డ్‌కు సదరు ఎయిర్‌లైన్స్ క్షమాపణలు చెప్పింది.

> **బ్రా ధరించలేదని తన పట్ల ఎయిర్ లైన్స్ సిబ్బంది అమర్యాదగా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేసింది. ఫ్లైట్ కూడా ఎక్కవద్దని అడ్డుకున్నారని పేర్కొంది. విమాన సిబ్బంది చేష్టలతో తీవ్ర అసహనా నికి గురైన ఆ మహిళ లాస్ ఏంజెల్స్‌లో మీడియాకు జరిగిన ఆ సంఘటనను వివరించింది.**

# ఆర్టీసిని ఆగం చేసిన చరిత్ర హరీష్‌ది



**హైదరాబాద్:** ప్రశ్నోత్తరాల సమయంలో ఆర్టీసీపై చర్చ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు మంత్రి పొన్నం ప్రభాకర్ మధ్య మాటల యుద్ధం సాగింది. గత ప్రభుత్వం ఆర్టీసీని చంపాలని చూసిందని పొన్నం ఆరోపించారు. ఆర్టీసీ యూనియన్లను గత ప్రభుత్వం రద్దు చేసిందని గుర్తు చేశారు. రూ. 280 కోట్ల బకాయిలు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆర్టీసీకి చెల్లించిందని తెలిపారు. హరీశ్ రావు వ్యాఖ్యలు దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉన్నాయన్నారు. హరీష్ రావు ఆర్టీసీ గౌరవాధ్యక్షులుగా ఉన్నారని గుర్తు చేశారు. రిటైర్డ్ ఆఫీసరైన వాళ్ల బంధువును ఎండీగా పెట్టుకుని ఆర్టీసీని ఆగం చేశారని ఆరోపించారు. సమ్మె సమయంలో ఆర్టీసీ ఉండదని బెదిరించారని కార్మికులను బెదిరించారన్నారు. తాము అధికారంలోకి వచ్చాక మూడు వేల ఉద్యోగాల భర్తీకి నిర్ణయం తీసుకొని నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. అప్పుడు ఫైనాన్స్ మంత్రిగా ఉన్న హరీశ్ రావు బడ్జెట్ లో రూ. 1500 కోట్లు కేటాయించి 400 కోట్లు కూడా ఇవ్వలేదన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ, జాగాలను లీజులకు తీసుకు బకాయిలు కూడా కట్టేదని విమర్శించారు. దీనిపై సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు స్పందిస్తూ.. ఆర్టీసీ యూనియన్లపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ కు లేదన్నారు. ఆర్టీసీలో తమ పార్టీ అనుబంధం సంఘం గుర్తింపు యూనియన్ గా ఉందన్నారు.

ఖమ్మంలో ఓ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నారని, ఎంతో మంచి వ్యక్తి చనిపోయారని గుర్తు చేశారు. యూనియన్లను రద్దు చేసిన వారికి మాట్లాడే అర్హత లేదని అన్నారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పోడియం దగ్గర బైఠాయించి నిరసనకు దిగారు. ఇదే ప్రశ్నపై సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. ఆర్టీసీ యూనియన్ కు గౌరవాధ్యక్షుడిగా ఉన్న హరీశ్ రావును తప్పించేందుకే అప్పటి సీఎం కేసీఆర్ ఆర్టీసీ సంఘాల రద్దు నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు.



వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
3
గురువారం 25 జూలై 2024


# 27న "భూ"సదస్సు జయప్రదం చేయండి.

## బిఎల్ పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరిగాద సిద్దిరాములు.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, జులై 24:**

ఇందిరమ్మ ఇండ్లు, ఇళ్ల పట్టాల సాధన కోసం బిఎల్ఎఫ్ ఆద్వర్యంలో ఈనెల 27 న నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే "భూ"సదస్సును జయప్రదం చేయలని బిఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు, బిఎల్ పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరిగాద సిద్దిరాములు కోరారు. బుధవారం పట్టణంలోని బిఎల్ టియూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో సిద్దిరాములు మాట్లాడారు. నిజామాబాదు, కామారెడ్డి జిల్లాల్లో వివిధ గ్రామాల్లో నిరుపేద కుటుంబంలు అనేక సంవత్సరాల నుండి ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకోనీ నివసిస్తున్న వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, పోడూ




భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లాలో అనేక సంవత్సరాల నుండి పేదల గుడిసెలు వేసుకొని ఉంటున్న పూలే అంబేడ్కర్ కాలనీ, జంగంపల్లి, నిజామాబాదు జిల్లా కేంద్రంలోని న్యూ కలెక్టర్ కార్యాలయం దగ్గర, జానకంపేట్ సుందరయ్య కాలనీ ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని అన్నారు. అలాగే మాచరెడ్డి, గాంధారి, చందురూ తదితర గ్రామాల్లో పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, భూమి లేని బహుజన శ్రామిక ప్రజలకు 5 ఎకరాల సాగు భూమిని ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27 శనివారం నిజామాబాదు జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవనంలో జరిగే భూ సదస్సుకు ప్రజలు తరలి రావాలని కోరారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథి గా జస్టిస్ చంద్రకుమార్, గౌరవ అతిథిగా బిఎల్ఎఫ్ చైర్మన్ నల్ల సూర్య ప్రకాష్, వక్త లుగా ఎంసిపిఐయు రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, బిఎల్ ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్, బిఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు యస్. సిద్దిరాములు, సబ్బని లత తదితరులు హాజరు కానున్నారని తెలిపారు. విలేకర్ల సమావేశంలో బిఎల్ ఎఫ్ రాష్ట్ర నాయకులు యం. ఆంజనేయులు, బిఎల్ పి కామారెడ్డి జిల్లా నాయకులు కర్రెవార్ నగేష్, గంగామణి పాల్గొన్నారు.

# జర్నలిస్టులను బెదిరించిన వారిపై చర్య తీసుకోవాలి.



## - టిడబ్ల్యూజేఎఫ్, టియుడబ్ల్యూజే డిమాండ్.

వేగుచుక్క న్యూస్, భైంసా, జులై 24: ఆదిలాబాద్ టీవీ9స్టాఫర్ నరేష్ ను బెదిరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కంది శ్రీనివాస్ రెడ్డి అనుచరులపై చర్య తీసుకోవాలని టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు పుప్పాల దేవిదాస్, టియుడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రమోద్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో బైంసాలో ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాజకీయ వార్తలు రాస్తే ఇష్టనుసారంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇకనైనా తీరు మార్చుకోవాలని లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. బెదిరించిన కాంగ్రెస్ నాయకులపై తక్షణమే పోలీసులు కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు. నిరసన కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# కేజీబీవీల్లో కనీస వేతనాలు అమలు చేయాలి.

## ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి.

## ఐఫ్ టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్.

**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, జులై 24:**

కేజీబీవీ, మోడల్ స్కూల్ హాస్టల్స్ నాన్ టీచింగ్, వర్కర్ల వేతనాల పెంపు, ఇతర డిమాండ్ల పరిష్కారం కోసం ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ యూనియన్ (ఐ.ఎఫ్.టీ.యు) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు బుధవారం ధర్నా నిర్వహించి, కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఐఎఫ్ టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్ మాట్లాడుతూ, కేజీబీవీ, మోడల్ స్కూల్ నాన్ టీచింగ్, వర్కర్లకు వెంటనే కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ముఖ్యంగా కాలేజీలుగా అప్ గ్రేడ్ ఐన కేజీబీవీల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని నియమించాలన్నారు. రిటైర్మెంట్ వయసును 65 ఏళ్లకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. ఉద్యోగ, ఆరోగ్య భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. వంట పాత్రలు ఇతర సామాగ్రిని






సరిపడా కొత్తవి అందించాలన్నారు. డ్యూటీచార్ట్ అమలు చేసి, పనిభారం తగ్గించాలని కోరారు. కంప్యూటర్ ఒకేషనల్ ఇన్స్ స్టక్టర్లకు ఫుల్ టైం వేతనాలు ఇవ్వాలని, ఏఎన్ఎం లకు నైట్ డ్యూటీలు తగ్గించాలని, నాన్ టీచింగ్ సిబ్బందికి బదిలీలు చేపట్టాలన్నారు. గత, ప్రస్తుత ముఖ్యమంత్రులు ఇచ్చిన హామీ మేరకు నాన్ టీచింగ్, వర్కర్లను రెగ్యులరైజ్ చేసే ప్రక్రియను ప్రారంభించాలన్నారు. నెల రోజుల్లో సమస్యలు పరిష్కరించకపోతే ఛలో హైదరాబాద్ నిర్వహిస్తామన్నారు. దీనికిజిల్లా కలెక్టర్ స్పందిస్తూ జిల్లా స్థాయిలో పరిష్కరించే సమస్యలను పరిష్కరిస్తామని, వేతనాల సమస్య ఎస్పీడీతో మాట్లాడతామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో కేజీబీవీ మోడల్ స్కూల్ నాన్ టీచింగ్ సిబ్బంది ఈశ్వరి, హేమలత, సుమలత, స్వరూప, మోతి, ఉమ, సుచేంద్ర, స్వర్ణలత, విజయలక్ష్మి, అనురాధ, జ్యోతి, మహేశ్వరి, గీత, సంధ్యా, పద్మ, సువర్ణ, రజియా, సాయమ్మ, గోదావరి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# టీయూకి రాష్ట్ర బడ్జెట్లో 200 కోట్లు కేటాయించాలి.




## - పిడిఎస్ యూ డిమాండ్.

వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి, జులై 24: తెలంగాణ యూనివర్సిటీ అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్లో 200 కోట్లు కేటాయించాలని తేయూ పీడిఎస్ యూ నాయకులు రవీందర్, అక్షయ్ లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఓల్డ్ బాయ్స్ హాస్టల్ లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ విశ్వవిద్యాలయాన్ని గత పాలకులు, విసి ధ్వంసం చేశారని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన యూనివర్సిటీ అభివృద్ధికి ప్రస్తుత ప్రభుత్వం పాటు పడాలని అన్నారు. రాష్ట్ర బడ్జెట్ లో యూనివర్సిటీ కి 200 కోట్లు కేటాయించాలని, రెగ్యులర్ వీసీలను నియమించాలని, ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. యూనివర్సిటీ హాస్టల్స్ లో నాణ్యమైన భోజనం అందించాలని, మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అక్రమ నిర్బంధాన్ని ఖండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, అర్జున్, రాకేష్ ,సాయి కృష్ణ, సాయి ప్రకాష్ మన్యంకొండ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులను అప్రమత్తంగా ఉండాలి.

## - జిల్లా కలెక్టర్ ఆశీస్ సాంగ్వాన్.

**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి, జులై 24:**

వర్షాల వలన జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు సంభవించకుండా అధికారులను అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశీస్ సాంగ్వాన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ వర్షాకాలంలో ప్రజలను అప్రమత్తం చేయడం, ధరణి, ల్యాండ్ ఆక్వేషన్, సీఎం గ్రీవెన్స్, డిస్టిక్ గ్రీవెన్స్, ప్రభుత్వ భూమి సంరక్షణ, అన్ని రకాల ధ్రువీకరణ పత్రాల జారీ, విపత్తు నిర్వహణ, తదితర రెవెన్యూ శాఖ సంబంధించిన అంశాలపై ఆర్డీవో స్థాయి నుండి డిప్యూటీ తాసిల్దార్ స్తాయి వరకు అధికారులతో సమావేశం నిర్వహించి సమీక్షించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కంటిన్యూగా వర్షాలు కురుస్తున్నందున వర్షాలతో జిల్లాలో ఎలాంటి ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా ముందస్తుగా ప్రజలను అప్రమత్తం చేయాలని, మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఎంపిఓలు, విద్యుత్తు, ఆర్డబ్ల్యూఎస్, వైద్య తదితర అన్ని శాఖల అధికారులతో మండల స్థాయి సమావేశం నిర్వహించాలన్నారు. అధిక వర్షాలు, వరదల వలన
ఏదైనా ఆపద సంభవించినప్పుడు సహాయం అందించడానికి మండల అధికారులు, సిబ్బందిని సిద్ధం చేయాలని అన్నారు. జిల్లాలో పెండింగ్లో ఉన్న 3500కు పైగా ధరణి దరఖాస్తులను వారం రోజుల్లోగా పూర్తి చేయాలని అన్నారు. భూమి కొలతల



కోసం పెండింగ్లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి త్వరగా కొలతలు కొలవాలని అన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ఆర్జీలను, జిల్లాలో నిర్వహించిన ప్రజావాణిలో స్వీకరించిన ఆర్జీలను త్వరగా పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీ శ్రీనివాస్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో తదితరులు పాల్గొన్నారు.



# నిర్బంధాలు విద్యార్థి ఉద్యమాలను అపలేవు.

## - పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జులై 24:**




నిర్బంధాలు విద్యార్థి ఉద్యమాలను ఆపలేవని పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో రాజేశ్వర్ ను అర్ధరాత్రి నిజామాబాద్ నగరంలో ముందస్తుగా ఇంటి వద్ద నిర్బంధించారు. దీనిని నిరసిస్తూ రాజేశ్వర్ బుధవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు.
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ప్రశ్నించే గొంతులను నొక్కుతున్నారని, రాష్ట్ర బడ్జెట్ లో విద్యారంగానికి 30%నిధులు కేటాయించాలనీ, అన్ని యూనివర్సిటీలకు రెగ్యులర్ వీసీ లను నియమించాలనీ , నిజామాబాద్ నగరంలో
మహిళా డిగ్రీ కళాశాల, జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని , ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక దృష్టి పెట్టాలని, పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ నిధులను విడుదల చేయాలని, సంక్షేమ యూనివర్సిటీ హాస్టల్స్ లో మెస్ చార్జీలు పెంచలని డిమాండ్ చేశారు. అక్రమ నిర్బంధాలను ప్రజాస్వామికవాదులు మేధావులు ఖండించాలని రాజేశ్వర్ కోరారు.

# జిల్లాకి మినీ స్టేడియంను కేటాయించండి.


## అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ డిమాండ్.

**వేగుచుక్క న్యూస్,హైదరాబాద్:**

తెలంగాణ శాసనసభ మీడియా పాయింట్ వద్ద బుధవారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడారు. ఒక వైపు కేంద్రప్రభుత్వం ఖేళో ఇండియా ను ప్రతిష్ఠాత్మనంగా తీసుకొని దేశం లోనియువతను క్రీడారంగం వైపు ప్రోత్సహిస్తూ ఫిట్ ఇండియా ను సాధించాలనే లక్ష్యంతో ముందుకు పోతున్నదని అన్నారు. దీనిలో మన తెలంగాణ రాష్ట్రము వెనకబడిఉందని, రాష్ట్ర క్రీడారంగంతో పాటు క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం, ప్రోద్భాలం కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం హయాంలో క్రీడా రంగభివృద్ధి పూర్తిగా నిర్లక్షనికి గురైందని, ఇప్పటివరకు చుస్తే తెలంగాణాలో కేవలం ఐదుగురు మాత్రమే రెగ్యులర్ కోచ్ లు పనిచేస్తున్నారని, సుమారు వంద మంది కాంట్రాక్టు లేదా అవుట్ సోర్సింగ్ పద్దతి పై పని చేస్తున్నారని అన్నారు. నిజామాబాద్




జిల్లాలో జాతీయ అంతర్జాతీయ అవార్డులతో పాటు అర్జున అవార్డులు, బంగారుపథకాలు అందుకున్న నికిత్ జరీన్, హుసముద్దీమ్ మహ్మద్, ఎండల సౌందర్య, కె. ఆనంద్ వంటి అనేక క్రీడాకారులు ఉన్నారని అన్నారు. కాని క్రీడ స్థలాల అభివృద్ధి ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నగరంలోని 6 ఎకరాల పైచిలుకు విస్తీర్ణం లో ఉన్నటువంటి పాతకలెక్టరేట్ స్థలము, అనుకోని ఉన్న గ్రౌండ్ ను మినీ స్టేడియం గా నిర్మించాలన్నారు. అలాగేపాత ఇరిగేషన్ భవనం యొక్క 2 ఎకరాల స్థలంలో ఇన్డోర్ స్టేడియం నిర్మించాలని, అదేవిదంగా 30 సంవత్సరాల క్రితం 15 ఎకరాలలో ఏర్పాటు చేసిన రాజారామ్ స్టేడియం లోఇప్పడివరకు ఎటువంటి సౌకర్యాలు లేక నిరాదరణకు గురి అయినటువంటిరాజారామ్ స్టేడియం ను వెంటనే పూర్తిస్థాయి క్రికెట్ స్టేడియం గా అభివృద్ధిచేయాలనీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.




# మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలి

**న్యూఢిల్లీ:** ధాన్యానికి ఇచ్చే మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించే విషయంలో ఇండియా కూటమి తరపున కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 12 మంది రైతు సంఘాల నేతలతో ఆయన సమావేశమయ్యారు. అయితే, రైతుల్ని లోపలికి అనుమతించే విషయంలో గందరగోళం నెలకొంది. తనను కలిసేందుకు వచ్చిన రైతులను పార్లమెంటులోకి పర్మిషన్?ఇవ్వలేదని రాహుల్ ఆరోపించారు. వారిని తన కార్యాలయానికి తానే ఆహ్వానించినట్లు వెల్లడించారు. రైతులు కావడం వల్లే వారిని లోనికి పంపలేదన్నారు. రైతు సంఘాల నేత జగ్జీత్ సింగ్ దల్లేవాల్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికీ రైతులకిచ్చిన హామీలను నెరవేర్చడంలో
విఫలమైందని, స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీకి పాదయాత్రగా వస్తామని చెప్పారు.



# జేపీఎల్ నిర్వహణ అభినందనీయం.

## - టీడబ్ల్యూజేఎఫ్ ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య.





**వేగుచుక్క న్యూస్,హైదరాబాద్ :**

నిత్యం పని ఒత్తిడితో ఉండే పాత్రికేయులకు ప్రొఫెషనల్ స్థాయిలో కేఎస్‌జీ జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్ (జేపీఎల్) నిర్వహించటం అభినందనీయమని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య అన్నారు. విజయానంద్ గ్రౌండ్‌లో బుధవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్ మ్యాచులకు బసవపున్నయ్య, రామచందర్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 'స్పోర్ట్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ తెలంగాణ (ఎస్‌జేఏటీ) సభ్యులు మీడియా మిత్రుల కోసం మంచి ప్రమాణాలతో జేపీఎల్ నిర్వహించటం సంతోషం. వార్తల సేకరణతో పని ఒత్తిడితో ఉండే పాత్రికేయులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయి. భవిష్యత్‌లో ఎస్‌జేఏటీ, టిడబ్ల్యూజేఎఫ్ కలిసి పని చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తాం. జేపీఎల్ నిర్వహణ సహా ఎస్‌జేఏటీ కార్యక్రమాలకు టీడబ్లూజేఎఫ్ నుంచి పూర్తి మద్దతు ఉంటుంది' అని బసవపున్నయ్య తెలిపారు.

# ఐఐటిలో సీటు వచ్చినా మేకలు కాస్తున్న విద్యార్థిని.

## - స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి.

**వేగుచుక్క న్యూస్, సిరిసిల్ల, జూలై 24**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గోనేనాయక్ తండాకు చెందిన బదావత్ మధులత జెఈఈ మెయిన్ లో(ఎస్టి) 824వ ర్యాంకు సాధించింది. పాట్నా ఐఐటి లో సీటు వచ్చి నా.. చేరేందుకు ఆర్థిక పరిస్థితి అనుకూలించక మేకల్ని మేపుకొంటూ, కుటుంబానికి ఆసరాగా ఉంటుంది. మధులత ఈ విషయం తెలుసుకున్న సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి రూ. 1.5 లక్షల సాయాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు.



## తెలంగాణకు ఎన్నో ప్రయోజనాలు

# సమకూరాయి

**పునర్విభజన చట్టం కింద ఎన్నో అభివృద్ధి పనులు**

**తెలుసుకోకుండా బడ్జెట్‌పై పోటీపడి విమర్శలా**

**బయ్యారం ఉక్కు సాధ్యంకాదనే పెట్టలేదు**

**అసెంబ్లీలో తీర్మానంపై మండిపడ్డ కిషన్ రెడ్డి**



**న్యూఢిల్లీ:** భారాస, కాంగ్రెస్ నేతలు పోటీపడి మరీ ప్రధాని మోదీని విమర్శిస్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. కేంద్ర నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తోందని, ఓట్ల కోసం తప్ప ప్రజలకు నిధులు ఖర్చు చేయట్లేదని ఆరోపించారు. సంక్షేమ పథకాల కోసం కేంద్రం రూ. 6లక్షల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని భారాస, కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్న నేపథ్యంలో ఆయన దిల్లీలో మీడియాతో మాట్లాడారు. పునర్విభజన చట్టం కింద అనేక హామీలు అమలు చేశాం. రామగుండంలో విద్యుదుత్పత్తి కేంద్రం ఏర్పాటు చేశాం. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి ప్రధాని శంకుస్థాపన చేశారు. గిరిజన వర్సిటీ కోసం కేంద్రం నిధులు మంజూరు చేసింది. జీఎస్టీ పరిహారం కింద రూ. 7వేల కోట్లు అందజేశాం. జాతీయ రహదారుల కోసం రూ. 1.10లక్షల కోట్లు ఖర్చు చేశాం. ఇప్పటికే రూ.వేల కోట్లతో రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయి. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ కోసం రూ. 700 కోట్లకుపైగా ఖర్చు చేస్తున్నాం. సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రం రూ. 1,248 కోట్లు కేటాయించింది'అని కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్‌పై రేవంత్ వ్యాఖ్యలను ఆయన ఖండించారు. తాను ఎంపీ పదవిలో ఉండాలనేది సికింద్రాబాద్ ప్రజల నిర్ణయమని.. తాను పదవిలో ఉండాలా లేదా అనేది తెలంగాణ ప్రజలు నిర్ణయిస్తారన్నారు. రేవంత్ రెడ్డి తనకు పదవి ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. తన చివరి శ్వాస వరకు కమలం జెండా పట్టుకుంటానని.. బీజేపీలోనే ఉంటానని స్పష్టం చేశారు. తాను ఎవరికీ బానిసను కాదని.. వ్యక్తుల కోసం తాను రాజకీయం చేయడం లేదన్నారు. పార్టీకి, పార్టీ సిద్ధాంతానికి మాత్రమే తాను బానిసనని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. రేవంత్‌లా తాను సోనియాగాంధీ బానిసను కాదని.. చివరి వరకు బీజేపీ జెండానే పట్టుకుంటానని తెలిపారు. కేంద్రం ప్రవేశపెట్టిన బ్జడెట్.. కుర్చీ బచావో బ్జడెట్ అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి స్పందించారు. కుర్చీ బచావో అనేది కాంగ్రెస్ నైజమని.. కుర్చీని కాపాడుకోవడం కోసం రాజకీయాలు చేసే పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. రేవంత్ తనకు సుద్దులు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. తెలంగాణ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందన్నారు. ఇప్పటికే రాష్ట్రానికి

ఎన్నో విధాలా సాయం చేస్తోందని.. భవిష్యత్తులోనూ సాయం కొనసాగుతుందన్నారు. కనీస అవగాహన లేకుండా బడ్జెట్‌లో తెలంగాణకు ఏమి లేదంటే కేందప్రభుత్వాన్ని తిట్టడం సరికాదన్నారు. కేంద్రాన్ని తిట్టడానికి అసెంబ్లీని కేంద్రంగా చేసుకున్నారని ఆరోపించారు. బడ్జెట్‌కు వ్యతిరేకంగా ధర్నా చేస్తామని చెప్పడానికి రేవంత్‌కు నోరు ఎలా వచ్చిందని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. సీఎం రేవంత్ ఢిల్లీకి రాగానే చెక్కులు రాసిస్తారా అన్నారు. దీక్ష చేసినంత మాత్రాన తెలంగాణకు ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. తెలంగాణలో సైనిక్ స్కూల్ రాకపోవడానికి కారణం ఎవరో రేవంత్ రెడ్డినే చెప్పాలన్నారు. బయ్యారం స్టీల్ ప్లాంట్ గురించి అడుగుతున్నారని.. అక్కడ ఐరన్ ఓర్ సరిగ్గాలేదన్నారు. బయ్యారం స్టీల్ ప్లాంట్ ఎందుకు పెట్టలేదో కేసీఆర్‌ను ఎప్పుడైనా అడిగారా అంటూ ప్రశ్నించారు. ప్రధాని మోదీ భూముల వ్యాపారం చేయడం లేదని కిషన్ రెడ్డి తెలిపారు.

# సాగునీటి ప్రాజెక్టులపై మండలిలో చర్చ



**హైదరాబాద్:** తెలంగాణ శాసన మండలిలో సాగునీటి ప్రాజెక్టులపై స్వల్పకాలిక చర్చ జరిగింది. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడారు. 'తుమ్మిడహట్టి వద్దే ప్రాజెక్టు కట్టాలి. అప్పుడే ప్రాణహిత నది నుంచి పుష్కలంగా నీళ్లు అందుతాయి. ప్రాజెక్టుకు బ్జడెట్‌లో రూ. 5 వేలకోట్లు కేటాయించాలి' అని కోరారు. గంధమల్ల రిజర్వాయర్ అంశం సుదీర్ఘంగా పెండింగ్‌లో ఉందని మరో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇది పూర్తయితే ఆలేరు ప్రాంతానికి లాభం చేకూరుతుందని.. ఈ బ్జడెట్‌లో నిధులు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# బడ్జెట్‌లో అన్ని రాష్ట్రాల పేర్లు ప్రస్తావించడం అసాధ్యం



**గతంలో కాంగ్రెస్ కూడా బడ్జెట్ ప్రసంగంలో ఇలాగే చేసింది**

**రాజ్యసభలో విపక్షాల విమర్శలపై నిర్మల కౌంటర్**

**బడ్జెట్ తీరుపై విపక్షాల నిరసన**

**న్యూఢిల్లీ:** కేంద్ర బడ్జెట్ విపక్షాపూరితంగా ఉందంటూ విపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తిప్పికొట్టారు. విపక్షాలు 'దారుణమైన ఆరోపణలు' చేస్తున్నాయని విరుచుకుపడ్డారు. తమ రాష్ట్రాలకు నిధులు, పథకాలు మంజూరు చేయలేదంటూ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు కాంగ్రెస్ సారథ్యంలోని విపక్ష పార్టీలు ఉద్దేశపూర్వకంగా ప్రయత్నాలు చేస్తున్నాయని అన్నారు. వివక్ష చూపారంటూ కాంగ్రెస్ విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే చేసిన ఆరోపణలపై నిర్మలా సీతారామన్ రాజ్యసభలో బుధవారంనాడు మాట్లాడుతూ, విపక్షాలు మరీ ముఖ్యంగా మల్లికార్జున్ ఖర్గే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని అన్నారు. చాలా రాష్ట్రాలు పేర్లు మంత్రి ప్రస్తావించ లేదని, కేవలం రెండు రాష్ట్రాల పేర్లే ప్రస్తావించానని ఖర్గే అంటున్నారు. కాంగ్రెస్ పార్టీ చాలాకాలం ఈ దేశాన్ని పాలించింది. చాలా బడ్జెట్‌లు కూడా ప్రవేశపెట్టింది. ప్రతి బడ్జెట్‌లోనూ దేశంలోని అన్ని రాష్ట్రాల పేర్లు ప్రస్తావించే అవకాశం రాదనే విషయం ఆ పార్టీకి బాగా తెలుసు' అని నిర్మలా సీతారామన్ వివరించారు.

ఈ ఏడాది ఫిబ్రవరి 1న ఓట్ ఆన్ అకౌంట్ సమర్పించగా, ఈ ఏడాది మొత్తానికి మంగళవారం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టామని, ప్రసంగంలో ఎక్కువ రాష్ట్రాల పేర్లు ప్రస్తావించ లేదని సీతారామన్ చెప్పారు. మోదీ సారథ్యంలోని కేంద్ర మంత్రివర్గం వర్ధన్‌లో ఒక నౌకాశ్రయం ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని, కానీ మంగళవారంనాటి బడ్జెట్ లో మహారాష్ట్ర ప్రస్తావించలేదని అన్నారు. దాని అర్థం మహారాష్ట్రను నిర్లక్ష్యం చేసినట్టా? అని ప్రశ్నించారు. తన ప్రసంగంలో ఎక్కువ రాష్ట్రాల పేర్లు, మేజర్ ప్రాజెక్టుల పేర్లు ప్రస్తావనకు రానంత మాత్రాన భారత ప్రభుత్వ స్కీమ్‌లు, పథకాలు వాటికి వర్తించవని అర్థమా వరల్డ్ బ్యాంకు, ఏడీబీ, ఏఐబీ వంటి సంస్థల నుంచి పొందిన ఎయిడెడ్ అసిస్టెన్స్ ఆ రాష్ట్రాలకు వెళ్లవని అర్థమా? అని ప్రశ్నించారు.

బడ్జెట్ ప్రసంగంలో దేశంలోని అన్ని రాష్ట్రాల పేర్లు చోటుచేసుకోవడమనే అశంపై కాంగ్రెస్ పార్టీకి నిర్మలా సీతారామన్ సవాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ గతంలో చేసిన బడ్జెట్ ప్రసంగాల్లో అన్ని రాష్ట్రాల పేర్లు ప్రస్తావించిన సందర్భం ఒక్కటైనా ఉందా? అని మంత్రి ప్రశ్నించారు. నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బ్జడెట్‌లో పలు రాష్ట్రాల పట్ల వివక్ష చూపించారంటూ 'ఇండియా' కూటమి ఎంపీలు పార్లమెంటు ఆవరణలో బుధవారంనాడు నిరసనకు దిగారు. కుర్చీని కాపాడుకునే బడ్జెట్, విపక్షాపూరిత బడ్జెట్‌అంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. విపక్ష నేతలు రాహుల్

గాంధీ, కాంగ్రెస్ ఎంపీ సోనియాగాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, టీఎంపీ ఎంపీ డోలాసేన్ తదితరులు ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు.

# బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయంపై తీర్మానం

హైదరాబాద్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై చర్చించిన అసెంబ్లీ కేందరం తీరును నిరసిస్తూ ..ఏకగ్రీవంగా తీర్మానానికి బుధవారం తెలంగాణ శాసనసభ ఆమోదం తెలిపింది. 'కేంద్ర బ్జడెట్‌లో తెలంగాణకు అన్యాయం' అనే అంశంపై సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టారు. బీజేపీ మినహా అన్ని పార్టీలు ఈ తీర్మానంపై తమ అభిప్రాయాలను తెలిపాయి. బీజేపీ మాత్రమే ఈ తీర్మానాన్ని వ్యతిరేకించింది. తీర్మానానికి వ్యతిరేకంగా బీజేపీ సభ్యులు సభ నుంచి వాకౌట్

చేశారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని, తెలంగాణపట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపిందని తీర్మానంలో పేర్కొన్నారు. బడ్జెట్‌ను సవరించి తెలంగాణకు నిధులు ఇవ్వాలని ఈ తీర్మానం ద్వారా కేంద్రాన్ని శాసనసభ కోరింది. ఎన్నోమార్లు ఢిల్లీ వెళ్లి ప్రధానిని, మంత్రులను కలిసి వినతిపత్రాలు ఇచ్చామని సిఎం అన్నారు. రాష్ట్రానికి నిధులు తెచ్చేందుకు ఢిల్లీలో దీక్ష చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు చేసిన డిమాండ్‌పై కూడా రేవంత్ స్పందించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేయడానికి సిద్ధమని ప్రకటిస్తామన్నారు. విపక్ష నేతగా కేసీఆర్ వస్తే.. ప్రభుత్వాధినేతగా తాను వస్తానని చెప్పారు. రాష్ట్రానికి నిధుల కోసం కేసీఆర్ ముందుకు రావాలన్నారు. మీరు తేదీ నిర్ణయించండి.. మేము దీక్షకు సిద్ధమని ప్రకటించారు. ప్రధానిని ఎన్నో అడిగాం.. ఒక్కటీ ఇవ్వలేదని భట్టి విక్రమార్క అసంతృప్తి వ్యక్తం చేశారు. మా ప్రతిపాదనలు కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదు. తెలంగాణ దేశంలో భాగం కాదా? ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం వ్యవహరించిం దన్నారు. కేంద్రం తీరుతో రాష్ట్రాలన్నీ ఆలోచనలో పడ్డాయి. తెలంగాణను కేంద్రం గాలికి వదిలేసిందన్నారు.

ఈ క్రమంలో నిరసనలో భాగంగా నెల 27న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఢిల్లీలో జరిగే నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరించడం ద్వారా తొలి నిరసన తెలియ చేస్తామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. అందరం ఏకతాటిపై ఉంటే కేంద్రం మెడలు వంచి నిధులు సాధించుకోవటం పెద్ద కష్టం కాదన్నారు. రాష్ట్రాలకు న్యాయంగా దకాల్సిన వాటా దక్కడంలేదు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఆఖరు నిముషం వరకు ప్రయత్నం చేశాం. తెలంగాణ హక్కులకు భంగం కలిగించినందుకు, నిధుల కేటాయింపులో జరిగిన అన్యాయానికి నిరసనగా ఈ నెల 27న జరిగే నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నాం అని అసెంబ్లీలో ప్రకటించారు. నీతి ఆయోగ్ సమావేశాన్ని ఇతర సీఎంలు కూడా బరిష్కరించారు. తమిళనాడు సీఎం స్టాలిన్ , కర్ణాటక సీఎం సిద్ధ రామయ్య, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్‌వీందర్ సింగ్ సుఖు నీతి ఆయోగ్ మీటింగ్‌కు హాజరు కావడం లేదు. తమ పార్టీ ముఖ్యమంత్రులు ముగ్గురు ఈ సమావేశానికి హాజరు కారని కాంగ్రెస్ ఢిల్లీలో ప్రకటించింది. బడ్జెట్‌లో కేంద్రం చూపిన వైఖరిపై బెంగాల్, కేరళ ముఖ్యమంత్రులు ఆగ్రహం వ్యక్తం చేసినప్పటికీ.. వారు నీతి ఆయోగ్ సమావేశానికి గైర్హాజర్ అయ్యే విషయంపై ఎలాంటి ప్రకటన చేయలేదు. అంతకుముందు రాష్ట్ర ప్రయోజనాలకోసం అందరం కలిసి పోరాడుదామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రయోజనాల కోసం రాజకీయాలు పక్కన పెట్టి అందరం కలిసి కేంద్రంతో పోరాటం చేద్దామన్నారు. తాము ప్రవేశపెట్టిన చర్చకు ప్రతిపక్షాల నుంచి ఆశించిన మద్దతు లభించకపోవడం దురదృష్టకరమని అన్నారు. రాష్ట్రానికి అన్యాయం జరిగినందుకే తమకు బాధగా ఉందని చెప్పారు.